క్లుప్తంగా

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



ఐనవోలు : మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన వడ్లకొండ యాదగిరి ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వరంగల్ డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు మంగళవారం యాదగిరి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్ రావు, బుర్ర రాజశేఖర్ ఉన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



వేలేరు : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని స్రవంతి ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కే.స్రవంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14,15,16వ తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలోని నేరేడుపల్లి కేజీబీవీ పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో స్రవంతి పాల్గొననున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని డీఈఓ అబ్దుల్ హై, జీసీడీఓ సునీత, పీఈటీ కిరణ్మయి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

'చేనేతమిత్ర'ను కొనసాగించాలి

శాయంపేట : రాష్ట్రంలోని చేనేత కార్మికులకు చేనేతమిత్ర పథకాన్ని కొనసాగించాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని చేనేత జౌళీశాఖ కమిషనర్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. బీసీ వర్గంలో పేదరికం అనుభవిస్తున్న పద్మశాలీలు రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితిలో ఉంటూ సరైన ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వినతిలో పేర్కొన్నారు. చేనేతతో పాటు పవర్ లూమ్స్ కూడా మూతపడుతున్నాయని, మరమగ్గ కార్మికులకు ప్రతినెల రూ. 10వేల రూపాయల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత మిత్ర ద్వారా ప్రతి చేనేత కార్మికుడికి రూ. 2వేలు, సహాయకుడికి రూ. 5వందల చొప్పున బ్యాంకు ఖాతాలో జమ అయ్యేవని తెలిపారు. ప్రస్తుతం కావడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ పథకాన్ని మళ్లీ కొనసాగించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి, పున్నేలు, రెడ్డిపాలెం 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలో చేపట్టే మరమ్మతుల కారణంగా బుధవారం సాయంత్రం 4.00 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్, ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలోని వనమాల కనపర్తి, కొండపర్తి, పున్నేలు, రెడ్డిపాలెం గ్రామాల గృహావసరాల కనెక్షన్‌తోపాటు వ్యవసాయ కనెక్షన్ కలిగిఉన్న వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని వారు తెలిపారు.

పలువురి బైండోవర్

వేలేరు : మండలంలోని కన్నారం గ్రామానికి చెందిన తొమ్మిది మందిని తహసీల్దార్ హెచ్.కోమి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై డి.హరిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు జేసీబీ, ట్రాక్టర్లతో చెరువు మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని సమాచారం అందుకున్న అదే గ్రామానికి చెందిన ఓవర్గంవారు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరుగగా ఇరువురు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారని తెలిపారు. వారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మరోసారి సంఘటనలు జరగకుండా హెచ్చరిస్తూ స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

నియామకం

వేలేరు : బీజేపీ మండల అనుబంధ కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా మారుపాక కోటి, యువమోర్చాగా మాలోతు రాజు, బీసీ మోర్చాగా కీర్తి సురేష్, ఎస్టీ మోర్చాగా మురావత్ రాజు, ఎస్సీ మోర్చాగా జోడు ముంతల నవీన్, మైనార్టీ మోర్చాగా ఎండీ గౌస్‌ను నియమించినట్లు వెల్లడించారు. తమ నియామకానికి సహకరించిన బీజేపీ నాయకులకు, పార్టీ పెద్దలకు నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశానుసారం పనిచేస్తామని తెలిపారు.

సబ్బండవర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- ఎమ్మెల్యేలు రేవూరి, గండ్ర
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు
- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు సూచన



పరకాల : పార్టీలో చేరిన వారితో రేవూరి



ధర్మసాగర్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇందిర



శాయంపేట : సొసైటీలో వార్పింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు



కమలాపూర్ : కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రణవ్

ఆత్మకూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో వివిధ గ్రామాల నుంచి పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరిని కంటికిరెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు రమేష్, ఎంపీపీ సుమలత రజనీకర్, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, డైరెక్టర్ రేవూరి జయ్‌పాల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, కిరీటి, వెంకటేశ్వర్లు, తిరుపతి, ఖాజా, సందీప్, రవి, సాంబయ్య, పాల్గొన్నారు.

పరకాల : 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలతోపాటు పట్టణంలోని 10వ వార్డుకు చెందిన 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. బండి శ్రీధర్, బండారి కృష్ణతో పాటు పలువురు చేరినవారిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్స్ జయమ్మ, సారయ్య, నాయకులు రామకృష్ణ, రాజేశ్వర్‌రావు, హరిప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం

శాయంపేట : చేనేత కార్మికులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘాన్ని మంగళవారం సందర్శించి గోడౌన్‌లో నిల్వఉన్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్నిరంగాలు దివాలా తీశాయని ఆరోపించారు. మండలంలోని చేనేత సొసైటీలో గతంలో 100మంది కార్మికులు పనిచేసేవారని ప్రస్తుతం 20మంది కార్మికులు మాత్రమే పని చేస్తున్నారని పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు తెలుపగా చేనేత కార్మికుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసికెళ్లి సమస్యలను పరిష్కరింపజేస్తానని అన్నారు. సొసైటీలో నిల్వవున్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసేలా కృషి చేస్తామన్నారు. బకాయిలున్న 20లక్షల నిధులను ప్రభుత్వం నుంచి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లు లేని నిరుపేద చేనేత కార్మికులకు ఇంధిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం మిగిలిన గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. రూ. 30లక్షలతో త్వరలో శాయంపేటకు అంబులెన్స్ అందజేస్తానని తెలిపారు. అనంతరం 100రోజుల పాలన పూర్తి అయిన సందర్భంగా కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఎంపీటీసీ చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో పీఏసీ చైర్మన్ శంకర్‌లింగం, సభ్యులు లక్ష్మీనారాయణ, ఆనందం, ప్రభాకర్, సమ్మక్క, పద్మ కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మండల అధికార ప్రతినిధి రవి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని కానిపర్తికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరగా హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేస్తుందన్నారు. ఇప్పటికే 6 గ్యారంటీలను అమలు చేయడంపై ప్రజల్లో ఆనందం ఉట్టిపడుతుందన్నారు. కుల, మత, వర్గ బేధం లేకుండా సబ్బండ వర్గాలను అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. కానిపర్తి గౌడసంఘం అధ్యక్షుడు వడ్లకొండ సంతోష్‌గౌడ్, మాలమహానాడు గ్రామ అధ్యక్షుడు కోడిగూటి సంతోష్, నాయకులు ఇసంపెల్లి సురేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, రమేష్‌గౌడ్, ఐలయ్య గౌడ్, భిక్షపతి, ప్రభాకర్, పరుశురాములుగౌడ్, శివకృష్ణగౌడ్, ఇంద్రసేన, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు 25 మంది మంగళవారం కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఇందిర కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ లక్ష్మీ భర్త రమణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, రణధీర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, మంజు, రవి, జీవలాల్, హాలియా, దేవయ్య, శంకర్, రాజయ్య, కనకయ్య, మధుకర్, కనకయ్య, రవి, రవి, కుమార్, కుమారస్వామి, భిక్షపతి, రాములు, రాజయ్య చేరిన వారిలో ఉన్నారు. ప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, దుర్గయ్య, ఖాసీం, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'యశోద' వైద్యసేవలు అభినందనీయం

నల్లబెల్లి : హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని రాంపూర్ మాజీ సర్పంచ్ చింతపట్ల సురేశ్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో ఏర్పాటు చేసిన యశోద సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి యాజమాన్యం స్వగ్రామంపై మమకారంతో సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యసేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. శిబిరానికి మండలంలోని మేడపల్లి, రాంపూర్, తదితర గ్రామాల ప్రజలు చేరుకుని వైద్య పరీక్షలు చేసుకున్నారు. శిబిరంలో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చెందిన ఆర్థో, గైనిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ సర్జన్, జనరల్ ఫిజిషియన్, చిల్డ్రన్, అంకాలజీ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ శిల్పారెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మణి సేవారణ్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఖలీల్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ బాలరాజ్, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల మండల కమిటీ ఎన్నిక



కుమారస్వామి



హరి

నెక్కొండ : స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఆర్‌ఎంపీల మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘం ముఖ్యసలహాదారులు కొంకాల సాంబయ్య మాట్లాడారు. అధ్యక్షుడిగా కుడికాల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి హరి, ప్రధాన కార్యదర్శిగా మాంకాల ఐలయ్య, కోశాధికారిగా బక్కి శంకర్, సహ కార్యదర్శిగా వాసుదేవ్, సలహాదారులుగా కుడికాల సాంబయ్య, రాచమల్ల వెంకటేశ్వర్లు, ధనుంజయ, కార్యవర్గ సభ్యులుగా శ్యాంసుందర్, మదార్, సతీశ్, వెంకన్న ఎన్నికైన నట్లు తెలిపారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు. తదనంతరం అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవలు అందించడంలో ఆర్‌ఎంపీలు కీలకమని చెప్పారు. ఆర్‌ఎంపీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు శ్రావణ్, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, రాజు, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయంపై హర్షం

- కేయూ మొదట గేట్ వద్ద సంబురాలు



సంబురాల్లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కేయూ క్యాంపస్ : ఢిల్లీలోని జేఎన్‌యూలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి గెలుపొందడంతో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సంబురాలు నిర్వహించుకున్నారు. పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. మతోన్మాద సంఘాలు ఎన్ని కుట్రలు చేసినా ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయాన్ని ఆపలేక పోయారన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానంపై కూడా వ్యతిరేకత పెల్లుబీకుతుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయం విద్యార్థిలోకానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కేయూ అధ్యక్షుడు సాయికిరణ్, జనరల్ సెక్రటరీ స్టాలిన్, ఉపాధ్యక్షురాలు పరిమిళ, మంద వికాస్, అనూష, మంధు, హోథిరాం, జస్వంత్, మంగిలాల్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి ఆశ్రయం



కాజీపేట : స్పృహతప్పి రోడ్డుపై పడిఉన్న ఓ వృద్ధుడిని మంగళవారం సహృదయ అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు ఎండీ యాకూబీ చేరదీశారు. ఖమ్మం పట్టణంలోని బూరన్‌పూర్ వీధికి చెందిన వృద్ధుడు మహ్మద్ పాషా (78) మూడేళ్లుగా హనుమకొండ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ రాత్రి వేళల్లో అదాలత్ సెంటర్‌లోని బస్టాపులో నిద్రిస్తుండేవాడు. వారంరోజులుగా ఎండలు మండిపోతుండడంతో సరైన నీరు, ఆహారం దొరక్క ఆరోగ్యం క్షీణించి, స్పృహతప్పి పడిపోయాడు. వృద్ధుడి అవస్థను గుర్తించిన ప్రయాణికులు ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనాథ ఆశ్రమానికి సమాచారం ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకురాలు యాకూబీ బస్టాపులో పడి ఉన్న వృద్ధుడిని సిబ్బంది సహకారంతో స్నానం చేయించి వస్త్రాలు తొడిగి చికిత్స చేయించారు. కోలుకున్న వృద్ధుడిని ఆశ్రమంలో చేర్చుకుని సేవలు అందిస్తున్న యాకూబీని స్థానికులు అభినందించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పరకాల: ఆన్‌లైన్‌గేమ్ కోసం పెట్రోల్ బంక్ డబ్బులు వాడుకోవడంతో బంక్ యజమాని ఇంటిని రాయించుకున్నాడని మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పరకాల పట్టణానికి చెందిన ఎండీ గౌస్ పాషా ఈ నెల 19న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు కారణమైన గుడెప్పాడ్‌లోని జే.కే పెట్రోల్ బంక్ యాజమానిపై మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆందోళనకు సిద్ధపడటంతో రాయించుకున్న ఇంటి పత్రాలు తిరిగి ఇవ్వడంతోపాటు ఆస్పత్రి ఖర్చులు భరించటానికి బంక్ యాజమాన్యం ముందుకు రావడంతో శాంతించారు. కాగా, పాషా మృతదేహానికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం పరకాలలో అంత్యక్రియలు నిర్వహించారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించడమే లక్ష్యం'

నర్సంపేట : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీని ఓడించడమే లక్ష్యంగా బహుజనులు ఏకం కావాలని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో బహుజన నాయకుల వైఫల్యాల వల్లే డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశించిన బహుజన రాజ్యస్థాపనకు భంగం కలిగిందని పేర్కొన్నారు. డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇకనైనా బహుజన కుల సంఘాలు సమిష్టి రాజకీయ ఎజెండాతో ముందుకు సాగాలన్నారు.

రేపు శ్వేతార్కలో సంకట హరచతుర్థి

కాజీపేట : కాజీపేట స్వయంభు శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో రేపు(గురువారం) సంకటహర చతుర్థిని పురస్కరించుకుని స్వామివారికి గులాలుతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి నిత్య కల్యాణ వేడుకలతో పాటు మాడ వీధుల్లో ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వరంగల్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మట్టెవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి సూచించారు. ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం విద్యార్థులకు మత్తు పదార్థాలతో పాటు వాటి నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకుంటే కేసులు నమోదు అయితే ఉద్యోగాలకు అనర్హులవుతారన్న విషయాలను గుర్తుపెట్టుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నారా లేదా అనే విషయాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌డీడీ సీతారాములు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- ఆర్డీఓ రమేష్‌బాబు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కమలాపూర్ : పార్లమెంట్ ఎన్నికలనేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని హుజూరాబాద్ ఆర్డీఓ ఎస్.రమేష్‌బాబు సిబ్బందికి సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కమలాపూర్ మండలం ఉప్పల్ ఎంపీయూపీఎస్, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఏడు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్లకు కల్పించనున్న వసతులను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అర్హులందరూ స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాలకుర్తి మాధవి, ఆర్ఐ అశోక్‌రెడ్డి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

- ఎంపీడీఓ బాబు



నీళ్లు పోస్తున్న బోరుమోటారు

కమలాపూర్ : వేసవి నేపథ్యంలో మండల వ్యాప్తంగా నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. మండల కేంద్రం నుంచి దేశరాజుపల్లికి వెళ్లే మార్గంలో శ్మశానవాటిక వద్ద గల బోరుమోటార్ చెడిపోవడంతో మంగళవారం నూతన మోటార్ బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు ఎలాంటి కష్టాలు కలుగకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు నీటిని వృధా చేయొద్దని, పొదుపుగా ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే గీత వృత్తికి రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

- మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్

నర్సంపేట : ఉద్యమాల ద్వారానే గీత వృత్తిని రక్షించుకోగలమని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ స్పష్టం చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకే ఎక్స్‌గ్రేషియా, ప్రమాద బీమా, సేఫ్టీ మోకులు, మోపెడ్, తదితరాలు ఇస్తామని హామీ ఇచ్చి తదనంతరం విస్మరిస్తున్నాయని తెలిపారు. పాలక పార్టీలు మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో గీత కార్మికులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రమాదాల బారిన పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు ఆదాయం కోసం బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ గీత కార్మికుల బతుకులను దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు గౌడ కులస్తులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని చెప్పారు. రాజకీయాలకతీతంగా గౌడ కులస్తులు, గీత కార్మిక సంఘాలు ఏకమైతేనే సమస్యలు పరిష్కారమౌతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, తదితరాలను వెంటనే విడుదల చేయడంతోపాటు గీత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని, నిర్వహణ కోసం రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌడిశాల సదానందం, రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాంపల్లి వెంకట్, నాయకులు గంప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో 'రియల్‌దందా'



వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్, నాయకులు

నర్సంపేట రూరల్ : కొందరు అక్రమార్కులు అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ దందాకు పాల్పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని పార్టీ బృందం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. పట్టణంలోని కాకతీయనగర్ శివారు లోగల సర్వే నెంబర్ 601/2లోని అసైన్డ్ భూమిని ఇటీవల కొందరు రైతుల నుంచి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా కొనుగోలు చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములు వ్యవసాయం చేసేందుకు తప్ప విక్రయానికి, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వ్యతిరేకమని చెప్పారు. విక్రయించినా, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినా పీఓటీ యాక్టు ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే విచారణ చేపట్టి సదరు అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం అక్రమానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్ఐ రజాక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, కలకోటి అనిల్, ఫరీదా, వర్షంతి, విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, లక్ష్మి, యాకలక్ష్మి, కొండి మల్లయ్య, నాగరాజు, వెంకన్న, తోటకూరి రజితతోపాటు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటేసే అవకాశం

సంగెం : దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి ఇంటి వద్దే ఓటేసే అవకాశం కల్పించనున్నట్టు తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు సెక్టోరల్ అధికారులు, సూపర్‌వైజర్లు ఎన్నికలకు సంబంధించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లోని 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారిని గుర్తించాలని ఆదేశించారు. వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్, సెక్టోరల్ అధికారులు రమేశ్‌కుమార్, యాకయ్య, సాయిరాజ్, రోహిణి, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.